సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం। 24। జనవరి। 2023



చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది. మార్కెట్‌కు 735 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
31.7°/11.2°

జిల్లా పరిధిలో సోమవారం చలి తీవ్రత అధికంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

ఓబులేశా నువ్వే దిక్కు!

దేవుని మాన్యం భూములను కొందరు దళితులు ఏళ్లుగా సాగు చేస్తున్నారు. నాటి అధికారులూ కనికరించి ఆ భూములను వారికే అప్పగించాలని నిర్ణయించారు. అయితే భూ హక్కు పత్రాలు ఇవ్వడంలో గత పాలకుల నిర్లక్ష్యం దళితులకు శాపంగా మారింది. ఆ భూములు సదరు వ్యక్తులకు దక్కకుండా చేసి లాభం పొందేలా స్వార్థపరులు కుట్రకు తెరలేపారు.



దళితులు సాగు చేస్తున్న ఓబులేశ్వరస్వామి మాన్యం భూమి

- ఏళ్లుగా దేవుని మాన్యం భూముల సాగులో దళితులు
- గత పాలకుల నిర్లక్ష్యంతో నేటికీ దక్కని భూహక్కు పత్రాలు
- భూమిని దక్కించుకునేందుకు స్వార్థపరుల కుట్ర
- న్యాయం చేయాలని ఎస్సీ,ఎస్టీల మొర

కదిరి: తలుపుల మండలం వేపమానిపేట పంచాయతీ పరిధిలోని కొత్త పూలవాండ్లపల్లి, గంజివారిపల్లి గ్రామాలకు చెందిన సుమారు 45 దళిత కుటుంబాలు కొన్నేళ్లుగా అక్కడి ఓబులేశ్వర స్వామి మాన్యం భూములను సాగు చేసుకుంటున్నాయి. గతంలో కదిరి ప్రాంతానికి చెందిన కొందరు విప్లవ పార్టీల నాయకులు ఆ మాన్యం భూములు సాగులో ఉన్న దళితులకే దక్కాలని డిమాండ్ చేశారు. సదరు దళితులు కూడా అధికారులకు అర్జీల రూపంలో మొరపెట్టుకున్నారు. అది దేవదాయశాఖకు చెందిన భూమి కావడంతో అప్పట్లో ఉన్న జిల్లా ఉన్నతాధికారులు ఎకరం రూ.15 వేలు చొప్పున ధర నిర్ణయించి వారికే ఇచ్చే విధంగా నిర్ణయించారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆ భూములను దళితులే సాగు చేసుకుంటున్నారు.

80 శాతం నగదు చెల్లింపు..

ఓబులేశ్వరస్వామి భూములకు సంబంధించి సర్వే నంబర్ 901లో మొత్తం 88.45 ఎకరాలు ఉన్నట్లు 1999లో అధికారులు గుర్తించారు. అందులోని 22.45 ఎకరాల భూమిని ఆలయ పూజారులకు ధూప, దీప నైవేద్యాల కోసం ప్రభుత్వం అప్పగించింది. మిగిలిన 66 ఎకరాల భూమిని ఒక్క సెంటు భూమి కూడా లేని దళిత మహిళలు ఐదుగురికి 1.85 ఎకరాలు చొప్పున, ఎకరంలోపు భూమి ఉన్న 20 మంది దళిత రైతులకు 1.80 ఎకరాలు చొప్పున, ఎకరంపైన – రెండెకరాల లోపు ఉన్న మరో 20 మంది దళితులకు ఎకరం చొప్పున లాటరీ పద్ధతిలో మొత్తం 45 మంది దళిత మహిళలకు 66 ఎకరాలు కేటాయించారు. ఇందుకుగాను 1999 ఏప్రిల్ 20న దళితుల తరపున ఎస్సీ కార్పొరేషన్ రూ.7.92 లక్షలను డీడీ (నంబర్ 426925) రూపంలో దేవదాయశాఖకు చెల్లించింది. మిగిలిన 20 శాతం అంటే రూ.1.98 లక్షలు ఆ దళితుల పేరు మీద హక్కు పత్రాలు ఇచ్చిన వెంటనే చెల్లిస్తామని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు అప్పట్లోని స్పష్టం చేశారు. అయితే అప్పటి నుంచి ఎన్నో ప్రభుత్వాలు మారినా దళితులకు భూ హక్కు పత్రాలు అందలేదు.

కోర్టుకు తప్పుడు నివేదికలు..

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వజ్రభాస్కర్‌రెడ్డి ఓబులేశ్వర స్వామి ఆలయ పూజారి శ్రీనివాసులుతో చేతులు కలిపి తమకు అన్యాయం చేస్తున్నారని బాధిత దళితులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని కరపత్రాలు ముద్రించి కూడా ప్రచారం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఓబులేశ్వరస్వామి భూములను అక్కడి దళితులు కబ్జా చేశారని, ఆ భూములను కాపాడాలని ఆయన కోర్టును సైతం తప్పుదోవ పట్టించే విధంగా పిటిషన్ దాఖలు చేశారని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై తాము కూడా హైకోర్టును ఆశ్రయించి వాస్తవ నివేదికలు సమర్పిస్తూ మరో పిటిషన్ దాఖలు చేశామని దళితులు చెబుతున్నారు. ఈలోగా దేవదాయశాఖ అధికారులు కోర్టు ఉత్తర్వులను సాకుగా చూపుతూ ఆ భూములను వేలం వేసి తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా సాగులో ఉన్నాం



30 ఏళ్లుగా ప్రభుత్వం ఇచ్చిన ఎకరం పొలంలో మేము సాగు చేసుకుంటున్నాము. అధికారులు ఆ భూమికి పట్టాలు, పాసు బుక్కులు ఇప్పటికీ ఇవ్వలేదు. ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాం. మాకు న్యాయం జరగలేదు. ఇప్పుడు ఆ భూములు వేలం వేసి ఎవరికో అప్పగించాలని చూస్తే మేము ఊరుకోము.

– సి.ఆదిలక్ష్మమ్మ, గంజివారిపల్లి

భూములు దక్కకుండా కుట్ర



మాకు ఎకరం భూమి ఇచ్చారు. పట్టా, పాసుబుక్కులు లేవని మాకు పంట నష్టపరిహారం ఇవ్వడం లేదు. ఇప్పుడేమో ఏకంగా ఆ భూములే మాకు దక్కకుండా జేసేందుకు కొంత మంది కుట్ర జేస్తున్నారు. మాకు ఈ ప్రభుత్వం న్యాయం చేస్తుందనే నమ్మకం ఉంది.

– కె.గంగులమ్మ, గంజివారిపల్లి

కోర్టు ఆదేశాల మేరకే...



మాన్యం భూములను కొన్నేళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్నప్పటికీ వారికి ఎలాంటి హక్కు పత్రాలు లేవు. ఆ భూములను వేలం వేసి హెచ్చు పాటదారులకు కౌలుకు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆ భూములను పాటదారులకు అప్పజెప్పవద్దని కూడా కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 20న జరగాల్సిన వేలంపాట వాయిదా పడింది.

– సి.రామాంజనేయులు, ఈఓ

న్యూస్‌రీల్

మాతా శిశు మరణాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మాతా శిశు మరణాలపై వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులతో కలెక్టర్ బసంత్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు నెలల్లో ఆరు శిశు మరణాలు జరిగాయని తెలిపారు. ఎక్కడా మాతా శిశు మరణాలు సంభవించకుండా రెండు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గర్భిణులకు సూచనలు ఇస్తూ 100 శాతం ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సమన్వయంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, డీఐఓ కృష్ణయ్య, వైద్యులు విజయలక్ష్మి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్



సిబ్బందితో ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

తాడిమర్రి: గ్రామాల్లో శాంతిభద్రతలే లక్ష్యంగా పని చేయాలని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుస్టేషన్‌లోని పెండింగ్ కేసుల రిజిస్టర్లను పరిశీలించారు. ఆదివారం పోలీసుస్టేషన్ ముందు నార్సింపల్లి గ్రామస్తులు నిర్వహించిన ధర్నా, నార్సింపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంపై ఇటీవల రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదంపై అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గొడవలు, ఘర్షణలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ముదిగుబ్బ సీఐ కంబగిరి రాముడును ఆదేశించారు. అలాగే చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రంలో ఫిబ్రవరి 18న జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఉత్సవాలు పురస్కరించుకొని ఎలాంటి గొడవలు జరగకుండా గ్రామస్తులు, ఆలయ గుడికట్టుదారులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ హుస్సేన్ పీరా, ఎస్ఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌కు పదో తరగతి మెటీరియల్



మెటీరియల్‌ను భద్రపరుస్తున్న దృశ్యం

కొత్తచెరువు: మండల కేంద్రమైన కొత్తచెరువులోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో సోమవారం 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఆధ్వర్యంలో భద్రపరిచారు. జిల్లాలో 10వ తరగతికి సంబంధించిన స్టేషనరీ, స్టడీ మెటీరియల్‌ను భద్రపరిచామని మీనాక్షి తెలిపారు.

సజావుగా డైట్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

పుట్టపర్తి: బుక్కపట్నంలోని డైట్ కళాశాలలో మొదటి సెమిస్టర్ పరీక్షలు తొలిరోజు సోమవారం సజావుగా సాగాయి. ఈ నెల 30వ తేదీ వరకూ ఈ పరీక్షలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. తొలిరోజు పరీక్షకు 90 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా... ఆరుగురు గైర్హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాలను డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ గోపాల్, చీఫ్ సూపరింటెండెంట్ నాగపద్మజ, పీడీ నాగరాజు పర్యవేక్షించారు.

మీరే న్యాయం చేయండి

- పోలీసు స్పందనలో బాధితుల వినతి



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న పుట్టపర్తికి చెందిన కావ్య

పుట్టపర్తి అర్బన్: '16 నెలల నుంచి మా ఆయన వెంకటరమణ కనిపించకుండా పోవడంతో నన్ను, మా ఇద్దరు బిడ్డలను ఇంట్లోకి రాకుండా మా మామ సుబ్రహ్మణ్యం తరిమేశారు. గతంలో మల్లికార్జున అనే వ్యక్తితో కలసి మా మామ అదనపు కట్నం కోసం వేధించారు. నా బిడ్డలను ఎలా పోషించాలో అర్థం కావడం లేదు... మీరే న్యాయం చేయండి' అంటూ పుట్టపర్తికి చెందిన కావ్య అనే వివాహిత జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 45 అర్జీలువచ్చాయి.

స్పందన అర్జీలలో కొన్ని ఇలా...

- తన ఇంట్లోని బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులు మూడు నెలల క్రితం చోరీకి గురయ్యాయని, గ్రామానికి చెందిన ఓ మహిళపై అనుమానం వ్యక్తం చేస్తూ చిలమత్తూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా స్పందించలేదని చిలమత్తూరు మండలం హుస్సేనాపురానికి చెందిన వెంకటరమణ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 7 తులాల బంగారు, పోయినా కనీసం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయలేదని తెలిపారు.
- చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కలలో సర్వే నంబర్ 231–4లో 1.82 ఎకరాల్లో మామిడి, చింత, జామ వంటి 250 పండ్ల మొక్కలు నాటి సంరక్షిస్తుండగా మడకశిర రెవెన్యూ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నేలకోటప్ప, ధనుంజయ మొక్కలు నరికి వేశారని బాధిత రైతు రవి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఎస్పీకి చూపించారు. సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. చెన్నేకొత్తపల్లి ఎస్ఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, న్యాయం చేయాలని మొర పెట్టుకున్నారు.
- ధర్మవరం పట్టణంలోని యాదవవీధిలోని డోర్ నెంబర్ 22/394 ఇంటిని 2021 జూన్ నెలలో జంపాల లక్ష్మీనారాయణ నుంచి కొనుగోలు చేశామని, అయితే ఇప్పటికీ వారు ఇంటిని ఖాళీ చేయకుండా బెదిరిస్తున్నారని ధర్మవరానికి చెందిన శివమ్మ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు.
- ధర్మవరంలోని ఓ ఏటీఎం వద్ద ఓ అపరిచిత వ్యక్తి తన ఏటీఎం కార్డును మార్చి రూ.20 వేలను డ్రా చేశాడని.. న్యాయం చేయాలంటూ ధర్మవరం మండలం రాంపురంకు చెందిన నాగభూషణ ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్ మోసానికి బలి..

- ఫ్లిప్‌కార్ట్ పేరుతో ఓ వ్యక్తి ఫోన్‌చేసి రూ.25 వేలు చెల్లిస్తే రూ.లక్షల గిఫ్ట్ వస్తుందని నమ్మించాడు. ఆ డబ్బు పంపించాక మరోసారి ఫోన్ చేసి గిఫ్ట్ మీ ఇంటికే పంపుతాం అని చెప్పారు. రూ.లక్ష పంపాలని చెప్పడంతో మళ్లీ ఆ డబ్బు పంపించా. ఆ తర్వాత ఆ ఫోన్ పనిచేయడం లేదు... మీరే న్యాయం చేయండి అంటూ హిందూపురానికి చెందిన నాగరాజు ఫిర్యాదు చేశారు.
- మీషో స్క్రాచ్‌కార్డు పేరుతో మూడు విడతలుగా ఆన్‌లైన్‌లో నా బ్యాంకు అకౌంట్ నుంచి రూ.50 వేలు కట్ అయ్యాయి.. న్యాయం చేయాలంటూ పరిగి మండలం శాసనకోటకు చెందిన గంగాధర్ ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామక్రిష్ణప్రసాద్, ఎస్‌బి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సీఐ రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ బసంత్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: 'స్పందన' కార్యక్రమంలో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగానే కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఒక్కో అర్జీదారుని సమస్యను ఓపికగా విన్న కలెక్టర్ ... కొన్నింటిని ఆయా శాఖలు, మండలాలకు పంపారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. స్పందనకు మొత్తం 174 అర్జీలు రాగా.. అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ బసంత్‌కుమార్ సమీక్షించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారం కాలేదనో, సరైనా పరిష్కారం చూపించలేదనో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు రాకూడదని హెచ్చరించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. చాలా సమస్యలకు మండలస్థాయిలోనే పరిష్కారం లభిస్తుందని, విషయం తెలియక చాలా మంది జిల్లా కేంద్రానికి వస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రజలకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగాదిలోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి..

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేవిధంగా హౌసింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. ఉగాది నాటికి 10,750 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి 1195 పనులకు గుర్తించగా 1072 పనులు మంజూరు అయ్యాయన్నారు. 913 పనులు ప్రారంభమయ్యాని, 159 పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. ఈనెల 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి అవార్డు అందించేందుకు అన్ని శాఖల నుంచి వివరాలు వెంటనే పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

స్పందనకు వచ్చిన అర్జీల్లో కొన్ని ఇలా...

- సర్వేనంబర్ 112లో తమకు చెందిన ఒక ఎకరా 60 సెంట్ల స్థలాన్ని టీడీపీ హయాంలో తెలుగుదేశం పార్టీకి చెందిన రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి పేరు మీద ఆన్‌లైన్‌లోకి ఎక్కించారు. 1965 సాగులో ఉన్న తమకు అన్యాయం చేస్తున్నారు. దయచేసి తమకు న్యాయం చేసి ఆన్‌లైన్‌లోకి తమ పేర్లు ఎక్కించాలంటూ పెనుకొండ మండలం కొండపల్లికి చెందిన గిరిజనులు ఫిర్యాదు చేశారు.
- ఐదు రోజుల క్రితం 5 ఎకరాల్లో కోత దశలో ఉన్న తన అరటి తోటకు దుండగులు నిప్పుపెట్టడంతో రూ.10 లక్షలు నష్టపోయా. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా సాయం చేయండయ్య అంటూ కనగానపల్లి మండలం గంతపల్లికి చెందిన రైతు బయపరెడ్డి అర్జీ ఇచ్చారు.
- ఆరోగ్యం సరిగా లేక ఏడాది క్రితం బెంగళూరులో రూ.3 లక్షలు ఖర్చు చేసి ఆపరేషన్ చేయించుకున్నాను. నేటికీ ఆ బిల్లు మంజూరు చేయలేదు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు చేసి అప్పుల నుంచి ఉపశమనం కలిగించాలంటూ నల్లమాడ మండలం కురుమాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వరదారెడ్డి అర్జీ అందించారు.

యువతితో అసభ్య ప్రవర్తన

- హోంగార్డుపై కేసు నమోదు



మాట్లాడుతున్న సీఐ తమ్మిశెట్టి

కదిరి టౌన్: యువతితో అసభ్యంగా ప్రవర్తించిన హోంగార్డ్ సుబ్బారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో వైఎస్ఆర్ నగర్‌కు చెందిన ఓ యువతి తన తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ట్యాబ్లెట్ల కోసం వెళ్తోందన్నారు. అయితే ఆ సమయంలో అర్ధరాత్రి ఏం పని ఉందని బూతులు తిడుతూ స్టేషన్‌కు రావాలని హోంగార్డ్ సుబ్బారెడ్డి బెదిరించాడన్నారు. కానిస్టేబుల్ కాయప్ప, హోంగార్డ్ సుబ్బారెడ్డి ఆ సమయంలో డ్యూటీలో ఉన్నారని అయితే కానిస్టేబుల్‌కు ఈ విషయంలో ఎలాంటి సంబంధమూ లేదన్నారు. కేవలం హోంగార్డ్ మాత్రమే ఆమెపై దురుసుగా ప్రవర్తించాడని సీఐ పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు. అయితే కేసు లేకుండా రాజీ ప్రయత్నాలు జరుగుతున్నాయని వార్తలొస్తున్నాయని విలేకరులు తెలియజేయగా.. అలాంటిదేమీలేదని, తాము బాధితురాలి వైపే నిలబడతామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ ఇసాక్ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.దీనబాబు

హిందూపురం: ప్రభుత్వం ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయంపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.దీనబాబు తెలిపారు. సోమవారం ఆయన హిందూపురం సబ్ జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌జైల్లో ఉంటున్న ఖైదీల వివరాలను జైలర్ చంద్రశేఖర్‌తో అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా న్యాయస్థానాల నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వార్షిక ఆదాయం రూ.3 లక్షల్లోపు ఆదాయం కల్గిన బీసీ, ఓసీ వర్గాలకు కూడా ఉచిత న్యాయ సహకారం అందిస్తామన్నారు. అలాగే ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు? ఎంత కాలంగా శిక్ష అనుభవిస్తున్నారు? న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా అనే విషయాలను న్యాయమూర్తి నేరుగా ఖైదీలతో మాట్లాడి తెలుసుకున్నారు. అలాగే మౌలిక సదుపాయాలు బాగున్నాయా? అని తెలుసుకున్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ రెడ్డి రమణమ్మ

గోరంట్ల: కిశోర బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రెడ్డి రమణమ్మ సూచించారు. సోమవారం ఖాజాపురం అంగన్‌వాడీ కేంద్రంలో భేటీబచావో - భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. అతిథిగా హాజరైన రెడ్డి రమణమ్మ కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో మందలపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత , సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో ఆర్థికాభివృద్ధి



చిరుధాన్యాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి

అమరాపురం: చిరు ధాన్యాల సాగుపై రైతులు అవగాహన పెంచుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని హేమావతిలో రైతులు, అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ రైతులకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటల సాగు వివరాలను వ్యవసాయ సిబ్బంది రైతులకు తెలియజేయలన్నారు. ముఖ్యంగా చిరు ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తోన్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సనావుల్లా, విద్యావతి, మడకశిర డివిజన్ సహాయ సంచాలకులు కృష్ణమీనన్, టెక్నికల్ అధికారి నరేష్, ఏఓ మంజునాథ, మార్కెట్‌యార్డు అధ్యక్షుడు జయరామప్ప, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు హనుమంత రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నాగేంద్రప్ప, సర్పంచ్ తిప్పేస్వామి, సభ్యులు మహబూబ్‌బాషా, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గగన తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వై.వి. సుబ్బారావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మోరుబాగల్‌లో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం- 2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

పట్టు బిగించిన గుజరాత్



తలపడుతున్న ఆంధ్ర, గుజరాత్ జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం వేదికగా నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు క్రికెట్ టోర్నీలో ఆంధ్రపై గుజరాత్ జట్టు పట్టు బిగించింది. రెండో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 361 పరుగులు సాధించింది. వివరాలు.. తొలిరోజు ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 193 పరుగులకే కుప్పకూలిన విషయం తెలిసిందే. రెండో రోజు ఒక వికెట్ నష్టానికి 54 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆట ప్రారంభించిన గుజరాత్ జట్టు 105 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 361 పరుగులు చేసింది. జట్టులో సన్‌ప్రీత్, లోచర్ భాగస్వామ్యం అద్భుతంగా రాణించింది. 271 బంతుల్లో 16 ఫోర్లతో సన్‌ప్రీత్ భగ్గ 125 పరుగులు, 198 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్సర్‌తో లోచర్ 113 పరుగులు సాధించారు.

జీడీఎస్ ఉద్యోగాల భర్తీకి నేడు నోటిఫికేషన్

అనంతపురం సిటీ: తపాలా శాఖలో ఖాళీగా ఉన్న గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) పోస్టుల భర్తీకి మంగళవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు ఆ శాఖ అధికారులు సోమవారం తెలిపారు. బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఉద్యోగాలను జీడీఎస్ కింద పరిగణిస్తారు. ఏయే జిల్లాల్లో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి, ఎక్కడెక్కడ ఖాళీలు ఏర్పడ్డాయి, ఎప్పటిలోపు దరఖాస్తు చేసుకోవాలనే సమగ్ర సమాచారంతో నోటిఫికేషన్ విడుదల కానుంది. దరఖాస్తు మొదలు, ఎంపిక విధానం, నియామక ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో ఉంటుంది.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

పుట్టపర్తి అర్బన్: వివిధ కేసుల్లో పోలీసులు రికవరీ చేసిన సెల్‌ఫోన్లను సంబంధీకులకు ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జిల్లా పోలీసులు రికవరీ చేసిన ఐదు సెల్‌ఫోన్లను సంబంధీకులకు అందజేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ.2.5 లక్షలు ఉంటుందన్నారు. ఇందులో ఒకేఒక్క సెల్‌ఫోన్ విలువ రూ.1.5లక్షలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ల రికవరీ అంశానికి సంబంధించి జిల్లా పోలీసులు అందుబాటులోకి తీసుకువచ్చిన చాట్‌బాట్ సేవలు సత్ఫలితాలను ఇస్తోందన్నారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా 63058 00426 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందిస్తే.. ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే కేసులు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వెల్డింగ్ షాప్‌లో చోరీ

ధర్మవరం అర్బన్: స్థానిక శిరిడి సాయిబాబా ఆలయంలో సమీపంలో ఉన్న వెల్డింగ్ షాప్‌లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఈ మేరకు పోలీసులకు షాప్ యజమాని ఇర్ఫాన్ ఫిర్యాదు చేశారు. తెల్లవారుజామున వెల్డింగ్‌షాప్‌లో దుండగులు చొరబడి వెల్డింగ్ మిషన్, ఇతర సామగ్రి అపహరించుకెళ్లారు. వీటి విలువ దాదాపు రూ.60 వేలకు పైగా ఉంటుంది. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రేషన్ డీలరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గాండ్లపెంట: నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదంటూ గాండ్లపెంట మండలం తుమ్మలబైలు గ్రామ చౌకధాన్యపు డిపో డీలరు దశరథనాయక్‌పై కలెక్టర్‌కు ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ బసంత్‌కుమార్‌ను తుమ్మలబైలు సర్పంచ్ రవీంద్రా నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కలసి వినతి పత్రం అందజేశారు.

రమేష్.. రెజ్లింగ్‌లో అదుర్స్

అతనో సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడు. మిత్రుడి సలహాలు, స్ఫూర్తి, సహకారంతో రెజ్లింగ్ పోటీల్లో అంతర్జాతీయ ఖ్యాతి గడించాడు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఉన్న మక్కువే అతన్ని ఈ స్థాయికి చేర్చింది. రెజ్లింగ్‌లో ప్రపంచ స్థాయిలో 5వ రేటింగ్ సాధించిన కాకప్పగారి రమేష్ క్రీడాప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో 5వ రేటింగ్ సాధించిన సచివాలయ కార్యదర్శి



రాష్ట్ర మంత్రి రోజాతో రెజ్లర్ రమేష్,



శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో రమేష్, తదితరులు (ఫైల్)



భార్య సాయిలతతో..

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన అంజినప్ప, వెంకటలక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు.. ఐదుగురు కుమారులు ఉన్నారు. వీరిలో చివరి వాడు రమేష్. 10వ తరగతి వరకూ శ్రీరంగరాజుపల్లిలోని చదువుకున్నాడు. ఆరో తరగతి చదువుతున్నప్పుడు క్రీడలపై ఆసక్తి కలిగింది. అప్పటి పీఈటీ మహేష్‌దీపక్ ఆధ్వర్యంలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ తదితర క్రీడాపోటీల్లో పాల్గొని పలు పతకాలు, ప్రశంసాపత్రాలను కైవశం చేసుకున్నాడు.

క్రీడా కోటాలో బీపీఎడ్..

పరిగి మండలం సేవామందిరంలోని ఏఎం లింగణ్ణ జూనియర్ కళాశాలలో ఇంటర్, హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన రమేష్‌కు పోలీస్ ఉద్యోగం అంటే చాలా ఇష్టం. దీంతో క్రీడలతో పాటు దేహదారుఢ్యంపై దృష్టి సారించి అందుకు తగ్గ వ్యాయామం చేస్తూ ఆహార నియమాలను పాటిస్తూ వచ్చారు. పలుమార్లు పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుని రాత పరీక్షల్లో స్వల్ప మార్కుల వ్యత్యాసంతో ఎంపిక కాలేక పోయేవారు. అయినా తన లక్ష్య సాధనలో ఏనాడూ నిరాశ పడలేదు. డిగ్రీ పూర్తి కాగానే స్పోర్ట్స్ కోటాలో తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో బీపీఎడ్ కోర్సులో చేరారు. ఆ సమయంలోనే పలు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని తన ప్రతిభ చూపారు.

మిత్రుడి సహకారంతో రెజ్లర్‌గా..

బీపీఎడ్ చేసే సమయంలో కర్నూలుకు చెందిన రమణతో రమేష్‌కు పరిచయం ఏర్పడింది. అప్పటికే మంచి రెజ్లర్‌గా రాణిస్తున్న రమణ.. ఆ దిశగా రమేష్‌ను ప్రోత్సహించారు. రమణ నేర్పిన మెలకువలతో 2015లో తిరుపతి వేదికగా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ స్థాయి పోటీల్లో రమేష్ పాల్గొని తొలి ప్రయత్నంలోనే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలోనే అప్పటి రెజ్లింగ్ స్టేట్ జనరల్ సెక్రెటరీ సయ్యద్ రఫీక్, రాఘవేంద్ర వద్ద శిష్యరికం చేస్తూ 2016లో శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నాయుడుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయిలో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించారు.

అనారోగ్యం వెంటాడుతున్నా..

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కర్నూలు వేదికగా 2017లో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే అవకాశం రమేష్‌కు దక్కింది. ఆ సమయంలో తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు. అయితే అందివచ్చిన అవకాశాన్ని ఆయన వృథా కానివ్వలేదు. జ్వరంతో బాధపడుతూనే పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారు. తిరిగి 2018లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ క్రమంలోనే 2019లో ఆగ్రాలో, 2021లో నేషనల్ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన పోటీల్లో పాల్గొని బ్రాంజ్ మెడల్‌ను సాధించారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక..

రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో దూసుకుపోతున్న రమేష్‌కు 2022లో అదృష్టం వరించింది. ఆ ఏడాది ఢిల్లీ వేదికగా అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరిగింది. రమేష్‌తో పాటు అనంతపురం జిల్లా గుత్తికి చెందిన అభిరామ్, గుంతకల్లుకు చెందిన అపర్ణ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అయితే ఇండియా రెజ్లింగ్ టీమ్ కోచ్ రాఘవేంద్రతో పాటు అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులంతా ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం.

5వ రేటింగ్‌తో రాణింపు..

రష్యాలోని మాస్కో వేదికగా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ రష్యా ఆధ్వర్యంలో 2022, మే 16 నుంచి 28వ తేదీ వరకూ జరిగిన అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో భారతదేశం తరఫున మొత్తం 18 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఏపీ నుంచి రమేష్, అభిరామ్, అపర్ణ ఉన్నారు. 48 దేశాలకు చెందిన క్రీడాకారులు 8 విభాగాల్లో తలపడగా.. ఇంటర్నేషనల్ రెజ్లింగ్ చాంపియన్‌గా రమేష్ నిలిచారు. ఆ సమయంలో సాధించిన పాయింట్ల ఆధారంగా ప్రపంచ స్థాయిలో 5వ రేటింగ్‌ను రమేష్ వశమైంది.

ప్రస్తుతం సచివాలయ సెక్రెటరీగా..

బీపీఎడ్ పూర్తి చేసిన రమేష్ ప్రస్తుతం హిందూపురం మండలంలోని బాలంపల్లి గ్రామ సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తరుణంలో ఈ ఉద్యోగం వచ్చింది. స్పోర్ట్స్ కోటాలో పోలీస్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు మరింత సాధన చేస్తున్నారు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు యువతకు రెజ్లింగ్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు.

ఒలింపిక్స్ విజేతనవుతా



రెజ్లింగ్ నన్ను ప్రపంచ స్థాయి క్రీడాకారుడిగా నిలబెట్టింది. కోచ్‌లు, క్రీడాశాఖల చైర్మన్లు, డైరెక్టర్లు, మిత్రులు, కుటుంబ సభ్యుల సహకారంతోనే ఈ స్థాయికి చేరుకోగలిగాను. నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. ఒలింపిక్స్‌లో బంగారు పతకాన్ని సాధించడమే నా జీవిత ఆశయం.

– రమేష్, సచివాలయ కార్యదర్శి

నిర్వాసిత రైతులకు న్యాయం చేయండి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే కేతిరెడ్డి

పుట్టపర్తి టౌన్: గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లోని రైతులకు పరిహారం పెంచి న్యాయం చేకూర్చాలని కలెక్టర్ బసంత్‌కుమార్‌ను ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ను ఆయన కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. విజయవాడ నుంచి పులివెందుల మీదుగా మొలకవేమల క్రాస్ మీదుగా రూ.7,500 కోట్లతో చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లోని కొన్ని గ్రామాలకు సంబంధించి 160 ఎకరాల విలువైన సాగుభూములు, ఉద్యానపంటలు, బావులు, బోర్లను రైతులు కోల్పోతున్నారన్నారు. వీరికి ప్రభుత్వం చెల్లిస్తున్న న్యాయమైన పరిహారాన్ని మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మొత్తం భూమి కోల్పోయిన రైతులకు అసైన్డ్ భూములు కేటాయించాలని విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పరిహారం పెంపు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అలాగే ఎమ్మెల్యే సూచించిన విధంగా అసైన్డ్ భూమిని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

'గోరు ముద్ద' రుచి అమోఘం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి

ఓడీ చెరువు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న జగనన్న గోరుముద్ద రుచి అమోఘమని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి అన్నారు. సోమవారం ఓడీ చెరువు పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులతో కలసి ముచ్చటించారు. భోజనం రుచి ఎలా ఉంది? గుడ్డు అందిస్తున్నారా? అంటూ చిన్నారులతో ఆరా తీశారు. ఓ చిన్నారి చేత ముద్ద పెట్టించుకుని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న ఆకాంక్షతో మెరుగైన విద్యతో పాటు, నాణ్యమైన భోజనాన్ని సీఎం వైఎస్ జగన్ అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వీన్ భాను, జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లక్ష్మీరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, సర్పంచ్‌లు గోవిందు, జగన్‌మోహన్‌చౌదరి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓ ఖాదర్ వలీబాషా, హెచ్ఎం షుకూర్‌ఖాన్, ఉపాధ్యాయురాలు నిర్మల పాల్గొన్నారు.



చిన్నారి చేత అన్నం ముద్ద పెట్టించుకుంటున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పర్యాటకంగా దేవరకొండ అభివృద్ధికి చర్యలు

బుక్కరాయసముద్రం: స్థానిక సిద్దరాంపురం రోడ్డులో కొండమీదరాయుడు వెలసిన దేవరకొండను పర్యాటకంగా అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఆలూరి రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌తో కలసి సోమవారం ఆయన దేవరకొండను పరిశీలించి, మాట్లాడారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సూచన మేరకు దేవరకొండను పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25న జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి దేవరకొండ వరకూ బైక్ ర్యాలీ చేపడతామన్నారు. అనంతరం దేవరకొండ వద్ద సభ ఏర్పాటు చేస్తామన్నారు. సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ హాజరవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చెద్దళ్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీధరబాబు, దేవదాయ శాఖ ఈఓ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్యాటకశాఖ అధికారి నాగేశ్వరరెడ్డి


వినియోగదారుల చేతికి బ్రహ్మాస్త్రం

- పౌరసరఫరాలు, తూనికలు, కొలతల్లో మోసాలకు చెక్ పెట్టేలా 1967 టోల్‌ఫ్రీ నంబర్
- ఈ నెల 11 నుంచి అందుబాటులోకి వచ్చిన సేవలు

పుట్టపర్తి టౌన్: పాల నుంచి ఫార్మా కంపెనీల వరకూ కల్తీ సరుకుల విక్రయాలు, రియల్టర్ల మోసాలు, ఈ-కామర్స్ సంస్థ దోపిడీ తదితర మోసాలకు చెక్ పెట్టేలా జగన్ సర్కార్ చర్యలు తీసుకుంది. వస్తువుల్లో నాణ్యత లోపిస్తే ఇప్పటి వరకూ వినియోగదారులు ఏమీ చేయలేని అసహాయ స్థితిలో కొట్టుమిట్టాడేవారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకువస్తూ వినియోగదారుల చేతికి బ్రహ్మాస్త్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. అందుతున్న సేవలు, వస్తువుల్లో నాణ్యత లోపించినా.. క్రయవిక్రయాల్లో చోటు చేసుకున్న మోసాలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

అందుబాటులో టోల్‌ఫ్రీ నంబర్..

పౌరసరఫరా, తూనికలు, కొలతల శాఖల్లో మోసాలకు చెక్ పెట్టేలా 1967 టోల్‌ఫ్రీ నంబర్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటి వరకూ అందుబాటులో పౌరసరఫరాల శాఖ 18004250082–1967, ఒకే దేశం ఒకే రేషన్ కార్డు 180042553157–14445 రాష్ట్ర ఆహార కమిషన్ 18004252388–155235, తూనికలు కొలతల శాఖ 18004254202–1967 అంటూ వేర్వేరు టోల్‌ఫ్రీ నంబర్లు ఉండేవి. దీంతో ఫిర్యాదులు ఒకరికి బదులు మరో శాఖకు వెళ్లేవి. అంతేకాక అన్ని నంబర్లు గుర్తుపెట్టుకోవడానికి ఇబ్బందిగా ఉండేది. ఈ ఇబ్బందులను దూరం చేస్తూ ప్రభుత్వం అన్ని టోల్‌ఫ్రీ నంబర్లను ఏకం చేస్తూ 1967 ఇంటిగ్రేటెడ్‌కాల్ సెంటర్‌కు అనుసంధానం చేసింది. ఈ కాల్‌సెంటర్ ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకూ పని చేస్తుంది.



టోల్‌ఫ్రీ సెంటర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు

ఎలాంటి ఫిర్యాదులూ చేసుకోవచ్చు..

ఈ కాల్‌సెంటర్‌కు వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖకు సంబంధించి అన్ని రకాల ఫిర్యాలు చేయవచ్చు. ప్రజా పంపిణీ వ్యవస్థలో తూకాల్లో మోసాలు. అధికంగా డబ్బు వసూలు చేయడం. ధాన్యం సేకరణ, గ్యాస్ సిలెండర్, పెట్రోల్ బంకుల్లో అవకతవకలపై ఫిర్యాదు చేయవచ్చు. అదేవిధంగా సూచనలు, సలహాలూ ఇవ్వవచ్చు. చేసిన ఫిర్యాదు నిర్దేశించిన సమయంలో ఏ దశలో ఉంది, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉంది అనే అంశాలను ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు

సద్వినియోగం చేసుకోవాలి



వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1967 నంబర్‌ను ఈ నెల 11 నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. మీ ప్రాంతాల్లో సమస్యలపై ఈ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి, పరిష్కారం పొందవచ్చు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, శ్రీసత్యసాయిజిల్లా

భారత ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ బసంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: భారత ప్రభుత్వం అన్ని శాఖల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ పిలుపునిచ్చారు. బీఐఎస్ ప్రమాణాలు, ప్రొడక్ట్ సర్టిఫికేషన్, నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు అందించడంపై రూపొందించిన బీఐఎస్ కేర్ యాప్ వినియోగంపై సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ ఇచ్చారు. విజయవాడలోని బ్యూరో ఆఫ్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు బీఐఎస్ జాయింట్ డైరెక్టర్లు సుజాత, రమాకాంత్, సాగర్ హాజరై ఇండియన్ స్టాండర్డ్స్, నాణ్యత, ప్రమాణాలు ఎలా అభివృద్ధి చేసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బీఐఎస్ అందించిన ఓరియంటేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సులో డీఎస్ఓ వంశీకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణారెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ చాంద్‌బాషా, వ్యవసాయ అధికారి సుబ్బారావు, గ్రౌండ్ వాటర్ అధికారి రాజశేఖరరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్ట్



మహేంద్ర (వృత్తంలో)ను కోర్టులో హాజరు పరిచిన ఎస్ఐ రంగడు

ఆత్మకూరు: దాదాపు 12 ఏళ్లుగా కళ్లు గప్పి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. తెలంగాణలోని మంచిర్యాల పట్టణానికి చెందిన మహేంద్రరావు... ఆత్మకూరు మండల సమాఖ్యలో అకౌంటెంట్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో సమాఖ్యకు చెందిన రూ.7,12,784 నగదు డ్రా చేసుకుని తన సొంతానికి వాడుకున్నాడు. విషయాన్ని పసిగట్టిన కావేరి మండల సమాఖ్య అధ్యక్షురాలు సమంత 2009లో చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మహేంద్రరావును న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం మహేంద్రరావు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. కేసు విచారణకు హాజరు కాకపోవడంతో 2011లో మహేంద్రపై నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను న్యాయస్థానం జారీ చేసింది. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక పెండింగ్‌లో ఉన్న ఈ కేసు పరిష్కారంపై ఎస్పీ ఫక్కీరప్ప దృష్టి సారించడంతో దర్యాప్తులో ఆత్మకూరు పోలీసులు పురోగతి సాధించారు. నిందితుడి ఆచూకీని ఎస్ఐ రంగడు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సోమవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు.


అరటి తోట దగ్ధం



మంటల్లో కాలిపోయిన అరటి గెలలు

కనగానపల్లి: మండలంలోని యలకుంట్లలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో అరటి తోట కాలిపోయింది. వివరాలు.. యలకుంట్లకు చెందిన రైతు రామిరెడ్డి తనకున్న ఆరు ఎకరాల్లో అరటి సాగు చేపట్టాడు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. సోమవారం సాయంత్రం తోటకు చేరువలో ఉన్న విద్యుత్ తీగలు గాలికి ఒకదానితో ఒకటి తగలడంతో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని నిప్పు రవ్వలు ఎగిసిపడి చెత్తపై పడడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో మంటలు శరవేగంగా తోటను చుట్టుముట్టాయి. రైతులు గమనించి మంటలు అదుపు చేసేలోపు 70 శాతానికి పైగా అరటి చెట్లు, కోత దశలో ఉన్న గెలలు కాలిపోయాయి. ఘటనతో రూ.15 లక్షల పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు రామిరెడ్డి తెలిపారు. సమాచారం అందుకున్న ఉద్యాన అధికారులు గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. పంట నష్టాన్ని అంచనా వేసి, నివేదికను సిద్ధం చేశారు.

జాతీయ స్థాయి క్రీడాపోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు రవికుమార్, అంజన్న వెల్లడించారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో రాజేష్, తేజశ్విని, అబ్దుల్లా, లావణ్య, జాహ్నవి, లక్ష్మి, పూజిత, హనీఫా ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. అలాగే ఫుట్‌బాల్ బాలికల విభాగంలో లహరి, అరుణాక్షి, వందన, నమ్రత, బాలుర విభాగంలో సంతోష్, రాంచరణ్, యశ్వంత్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను అనంతపురంలోని కొత్తూరు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రత్యేకంగా అభినందించారు.